30 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

మణికొండ: ఓయూ కాలనీ శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. 9 రోజుల పాటు రోజూ సాయంత్రం ఓ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. మొదటి రోజు 30వ తేదీన ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, విఘ్నేశ్వరపూజ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఏప్రిల్ 3న చండీహోమం, అన్నదానం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'మాస్టర్ గేమ్స్' ఉపాధ్యక్షుడిగా కృష్ణ



నియామక పత్రం అందుకున్న కృష్ణ

మణికొండ: మాస్టర్ గేమ్స్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ ఉపాధ్యక్షుడిగా మంచిరేవుల గ్రామానికి చెందిన పొన్న కృష్ణను నియమించారు. ఆయన గడచిన మూడు దశాబ్దాలుగా క్రీడా రంగంలో చేసిన సేవలను గుర్తించి అతన్ని నిమించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వై.రామారావు నియామక పత్రంలో లిపారు. అతనికి బుధవారం రాష్ట్ర కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... ఇప్పటి వరకు బాక్సింగ్, రెజ్లింగ్, వాలీబాల్ లాంటి క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. రాబోయే రోజుల్లో వాటి అభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి మరింత కృషి చేస్తానన్నారు.

పశువుల పెంపకంలో సమస్యలపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న రిజిస్ట్రార్

ఏజీవర్సిటీ: పశువుల పెంపకంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటి పరిష్కారాలపై పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, ఐసీఆర్ ఆధ్వర్యంలో ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. పశువైద్య విశ్వవిద్యాలయం రూపొందించిన వివిధ ఆవిష్కరణలపై చర్చించారు. వాటిని రైతులకు ఏ విధంగా చేరవేయాలి అనే అంశంపై రోడ్ మ్యాప్ తయారు చేశారు. ఇంటర్నెట్‌ను ఉపయోగించుకుని పశుసంపద గురించి కావలసిన సమాచారాన్ని రైతులకు చేరవేసేందుకు ఉన్న మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శరత్‌చంద్ర, డీన్ ఆఫ్ ఫ్యాకల్టీ ఉదయకుమార్, పరిశోధక సంచాలకులు కిషన్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కంపెనీల ప్రతినిధులకు మొక్క అందజేస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లోని ఎర్రకుంట డెవలప్‌మెంట్‌లో భాగంగా బుధవారం అధికారులు పర్యవేక్షించారు. సేల్స్ ఫోర్స్, గ్రీన్ యాత్ర కంపెనీ, బయోడైవర్సిటీ పార్క్ బెంగుళూరు కంపెనీ బృందంతో కలిసి గ్రీనరీని పరిశీలించారు. మొదట విడతలో గ్రీనరీ డెవలప్‌మెంట్, రెండో విడతలో లేక్ డెవలప్‌మెంట్, రెయిన్ వాటర్‌ని కుంటలోకి తరలించేలా అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ డీఈ యాదయ్య, మాజీ కార్పొరేటర్ ప్రతినిధి గోకరి సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బండ్లగూడలో కలుషిత నీటి సరఫరా



బండ్లగూడ: మంచినీటి సరఫరాలో కలుషిత నీరు కలుస్తుండటంతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలకు నల్లాల ద్వారా ఫిల్టర్ వాటర్ అందడం లేదు. హిమాయత్‌సాగర్ వాటర్ ఫిల్టర్ కాకపోవడంతో నీటిలో వాసన వస్తుంది. పచ్చటి నీటి సరఫరా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఏసీ రూమ్‌లలో కూర్చుంటున్నారు తప్ప ప్రజలకు ఎలాంటి నీరు సరఫరా అవుతున్నాయో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కలుషిత నీటి సరఫరాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ పనులకు...
కూలీల అనాసక్తి



పాల్మాకులలో సాగునీటి కాలువలో మట్టి పనులు చేస్తున్న కూలీలు

- రెండు చోట్లే ప్రారంభమైన పథకం పనులు
- ప్రధానంగా శ్రద్ధ చూపని పురుషులు
- కూలీ తక్కువగా ఉందనే కారణంగా పనులకు రాని వైనం
- వేసవిలో వసతులు కల్పిస్తున్నా కానరాని ఫలితం



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న సిబ్బంది

శంషాబాద్ రూరల్: ఏడాదిలో కుటుంబానికి వంద రోజులు పని కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ పథకంపై కూలీలు ఆసక్తి చూపడం లేదు.. ఈ పథకంలో ప్రయోజనకర పనులను చేపట్టకపోవడం కూడా అమలుల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయి.

- శంషాబాద్ మండల పరిధిలో 21 పంచాయతీలకుగాను కేవలం రెండు పంచాయతీల్లో మాత్రమే ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయి. పాల్మాకుల, ననాజీపూర్‌లో సాగునీటి వరద కాలువల్లో మట్టి పనులు చేపట్టారు. రెండు చోట్ల 42 మంది కూలీలు పనులు చేస్తున్నారు.
- ముఖ్యంగా వేసవిలో కూలీలకు ఉపాధి కల్పించడానికి పనులను గుర్తించి కార్యాచరణ రూపొందించారు.

పూడికతీతకు మంగళం...

గతంలో ఆయా పంచాయతీల పరిధిలో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టారు. ప్రస్తుతం పూడికతీత పనులను కాకుండా ఇతర పనులకు ప్రాధాన్యత కల్పించారు. పాల్మాకుల చెరువులో మైసమ్మ చెరువు అలుగు నుంచి పారే సాగునీటి కాలువ, ననాజీపూర్‌లో ఫిరంగి కాలువలో పనులు గుర్తించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఆయా సాగునీటి కాలువల్లో మట్టి పనులు చేపట్టారు. రోజూ కూలీ రూ. 300లకు సరిపడేలా పని చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం కాలువలో నిర్దేశించిన సైజులో మట్టి పని చేయాల్సి ఉంటుంది.

- మూడు మీటర్ల వెడల్పు, మూడున్నర మీటర్ల పొడవు, 0.3 మీటరు లోతులో మట్టి తవ్వకాలు చేయాలి. ఈ పని కోసం ఒక జతను నియమించారు. ఒక్కరికి రూ. 300 కూలీ లభిస్తుంది.
- పాల్మాకులలో ఈ నెల 3న పనులు ప్రారంభం కాగా.. ననాజీపూర్‌లో ఫిబ్రవరి 17 నుంచి కూలీలు పనులు చేస్తున్నారు.
- ఇదిలా ఉండగా సుల్తాన్‌పల్లిలో ఎంటీరువాగులో మట్టి పనులు గుర్తించగా.. కూలీలు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు.
- నర్కూడ శివారులో అమ్మపల్లి ఆలయం సమీపంలో సాగునీటి కాలువలో మట్టి తీత పని గుర్తించారు. ఇక్కడ పట్టా పొలాలు ఉండటంతో రైతులు పనులు చేయడానికి ఆసక్తి చూపడంలేదు.

రైతులకు ప్రయోజనం

ఉపాధి హామీ పథకంలో రైతులకు ప్రయోజనం సమకూరేలా పనులు ఉన్నా పెద్దగా ఆసక్తి చూపడంలేదు. పొలాల్లో వరద కట్టలు, వాన నీటి నిల్వ కోసం గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు ఈ పథకంలో అవకాశం కల్పించారు. దీంతో పాటు పాడి రైతులు పశువుల పాకను నిర్మించుకునేందుకు కూడా ఈ పథకం అమలు చేస్తున్నారు.

- 14 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో పాక, నీటి తొట్టి నిర్మాణానికి రూ. 1.20 లక్షలు చెల్లిస్తారు. ఇందుకోసం రైతులు ముందుకు రావడంలేదు.

మహిళలే ఆసక్తిగా...

ప్రస్తుతం రెండు పంచాయతీల్లో చేపడుతున్న పనుల్లో ఒకరిద్దరు మినహా అందరూ మహిళా కూలీలు ఉన్నారు. పాల్మాకులలో 19 మంది పనికి వస్తుండగా.. వీరిలో 17 మంది మహిళలు పనులు చేస్తున్నారు. ననాజీపూర్‌లో 23 మందిలో ఒక్కరే పురుష కూలీ ఉన్నారు. మట్టి పనుల్లో భాగంగా మహిళలే గుంతలు తవ్వి మట్టిని తొలగిస్తున్నారు.

- ఇదిలా ఉండగా వేసవి దృష్ట్యా కూలీలకు పని చోటనే సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీరు, నీడ కోసం షేడ్‌నెట్ ఏర్పాటు చేస్తున్నారు. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ కిట్‌తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సమకూర్చుతున్నారు.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూలీలు పనులు చేస్తున్నారు. తక్కువ కూలీ గిట్టుబాటు కావడంలేదనే కారణంగా పురుషులు పనులు చేసేందుకు రావడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి

బీజేపీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్యాన్ని వీడాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరిందన్నారు. బుధవారం బాబుల్‌రెడ్డినగర్‌లో స్థానికుల విజ్ఞప్తి మేరకు జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే ప్రజలకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్ణ పనుల వల్ల డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయని ఇవి మీ కంటికి కనిపించడం లేదా అని నిలదీశారు. ఏఈ నర్సింహామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరీష్, జలమండలి అధికారి లోక్‌నాథ్, రమేష్‌రెడ్డి, సెంట్రింగ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



డివైడర్ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

- మార్కండేయనగర్ ప్రధాన రహదారిపై జరుగుతున్న డివైడర్ కారణంగా ప్రజలు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మార్కండేయనగర్ ప్రధాన రహదారిపై జరుగుతున్న డివైడర్ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు.

బుల్కాపూర్ నాలాను పరిరక్షించాలి



బుల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: శంకర్‌పల్లి మండలం బుల్కాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు ఉన్న బుల్కాపూర్ నాలా గండిపేట మండలంలో అనేక చోట్ల కబ్జాలకు గురయ్యిందని, దాన్ని పూర్తి స్థాయిలో హైడ్రా అధికారులు పరిరక్షించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని డైమండ్ హిల్స్, కేఎస్ఆర్ హిల్స్ కాలనీలలో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా పర్యటించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ... ఇటీవల హైడ్రా కమిషనర్ బుల్కాపూర్ నాలాను సర్వే చేసి పరిరక్షిస్తామన్నారని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. నాలాతో పాటు బఫర్, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను కలుపుకొని ఇష్టారాజ్యంగా భవనాలు నిర్మించారన్నారు. నాయకులు కె.ధన్‌రాజ్, ఉపేంద్రనాథ్ రెడ్డి, శ్రీకాంత్, జి.విఠల్, మల్లేష్, దిలీప్, కిరణ్, కె.ప్రవీణ్, సుమనశిని, బి.శ్రీధర్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ



కిట్లను అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: మార్కండేయనగర్ అంగన్‌వాడీ కేంద్రం-2 (ప్రీ స్కూల్)లో బుధవారం కిశోర బాలికలకు రక్త హీనత తగ్గించడానికి పోషకాహార పదార్థాలు, విటమిన్, మినరల్, న్యూట్రిషన్ పౌడర్ ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రత్న మాట్లాడుతూ... రాజేంద్రనగర్ పరిధిలోని 26 అంగన్‌వాడీ కేంద్రాలను బునియాడ్ సంస్థ దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తుందన్నారు. పిల్లల భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా సంస్థ విద్య, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తుందన్నారు. బునియాడ్ సంస్థ వలంటరీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ... పేద పిల్లలకు మెరుగైన విద్యా అవకాశాలు అందించాలనే లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తుందన్నారు.



బండ్లగూడ అంగన్‌వాడీ కేంద్రంలో...

బండ్లగూడలో...

బండ్లగూడ: సపోర్టడ్ బై మెట్రోనిక్ యూనైటెడ్ ఆఫ్ హైదరాబాద్ బునియాడ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం కిట్లు పంపిణీ చేశారు. బండ్లగూడలోని అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు కావాల్సిన స్టేషనరీ సామగ్రితో పాటు 11-18 సంవత్సరాల విద్యార్థినులకు పౌష్టికాహార కిట్లును అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడం హర్షణీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

శంషాబాద్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభలు

- ఏప్రిల్ 21, 22వ తేదీల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- ఆహ్వాన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు



మాట్లాడుతున్న పర్వతాలు

శంషాబాద్: కార్మికుల శ్రమదోపిడీని అడ్డుకునేందుకు భవన నిర్మాణ కార్మిక సంఘం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం అవుతోందని భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభల ఆహ్వాన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు అన్నారు. ఏప్రిల్ 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న వెల్లడించారు. రాష్ట్ర స్థాయి మహాసభలకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల శ్రమదోపిడీతో కాంట్రాక్టర్లు కోట్లు గడిస్తున్నారన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి శివార్లలో జరుగుతున్న అనేక నిర్మాణాల్లో వలస కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. వలస కార్మికుల సంక్షేమం, భద్రత కోసం తాము పోరాడుతామన్నారు. అడ్డాల వద్ద మౌలిక వసతులు, భోజన ఏర్పాట్ల కోసం కూడా పోరాడుతున్నట్లు చెప్పారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నర్రగిరి, ఆర్.యాదగిరి, నర్సింహారెడ్డి, అన్నపు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నందున గురువారం ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. రాందేవ్‌గూడ, వన్ మోర్‌నగర్, నెక్నాంపూర్ గ్రామం, ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పోయనీర్ ఎస్టేట్, వెంకటేశ్వర కాలనీ, వైఎస్సార్ కాలనీ, పాషకాలనీ, అలిజాపూర్, ఇబ్రహీంబాగ్, పారడైజ్ కాలనీ, కోహినూర్ కాలనీల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్ కాలనీ, క్యూబా కాలనీ, క్వాస్వా కాలనీ, వివేకానంద నగర్ కాలనీ, మంచిరేవుల, మంత్రి విల్లాస్, గ్రీన్‌ల్యాండ్స్ కాలనీ, జైహింద్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వివరించారు.

'అక్షయపాత్ర'కు విద్యుత్ వాహనాల వితరణ



ఎలక్ట్రిక్ వాహనాలను అందజేస్తున్న వాఘ్‌బక్రీ ప్రతినిధులు

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్‌లు, అంగన్‌వాడీలు, నగరంలో రూ. 5కు మధ్యహ్న భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాఘ్ బక్రీ ఫౌండేషన్ తన తోడ్పాటును అందించింది. బుధవారం నార్సింగిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ వద్ద భోజనాన్ని తరలించేందుకు అవసరమైన 9 ఎలక్ట్రిక్ వాహనాలను అందజేశారు. ఆహారం తాజాదనాన్ని కాపాడేలా టెంపరేచర్ కంట్రోల్ సౌకర్యంతో వాటిని ప్రత్యేకంగా తయారు చేశారు. ప్రముఖ టీవీ నటి సుమ కనకాల, వాఘ్ బక్రీ టీ గ్రూప్ సీఈఓ సంజయ్‌సింగ్‌లు అక్షయపాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యాగ్నేశ్వర్ దాస్‌కు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్రకు తమ వంతు తోడ్పాటును అందిస్తామన్నారు. అక్షయపాత్ర 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 78 ప్రదేశాల్లో వంటశాలలను నిర్వహిస్తున్నదన్నారు. 23 వేల పాఠశాలలు, అంగన్‌వాడీలకు 22.5 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నదన్నారు. వాఘ్‌బక్రీ ఫౌండేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్‌శిండే, దక్షిణ విభాగం అధిపతి పి.వి.సురేష్, సీఎస్ఆర్ అధిపతి అజయ్ సిసిలియా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ అవసరం



వైద్య పరీక్షలను ప్రారంభిస్తున్న ఎంజీఐటీ ప్రిన్సిపాల్

మణికొండ: ఆరోగ్యమే మహాభాగ్యమని దాన్ని సంరక్షించుకునేందుకు ప్రతి సంవత్సరం అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నానల్ నగర్‌లోని ఆలివ్ ఆస్పత్రి వారు గుండె పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ అనేక రకాల ఒత్తిడిలకు గురవుతుండటంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. వాటిని నివారించుకునేందుకు ప్రతి ఒక్కరు విధిగా వాకింగ్, యోగా, సూర్య నమస్కారాలు చేయాలన్నారు. ఆలివ్ ఆస్పత్రి టుడీ ఎకో స్పెషలిస్ట్ స్వప్న, డాక్టర్ షఫీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'క్యాన్ నంబర్'లు జారీ చేయాలి



జలమండలి అధికారులను కలిసిన ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు

మణికొండ: గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో చాలా గృహాలకు కనెక్షన్‌లు ఉన్నాయని, వాటన్నింటికీ క్యాన్ నంబర్‌లను జారీ చేసి నెల వారీ బిల్లులు తీసుకోవాలని జలమండలి అధికారులను మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ రెసిడెన్షస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులుల ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు జలమండలి జీఎం మహేందర్‌నాయక్, మేనేజర్ రామకృష్ణారెడ్డిలను కలిశారు. ఈ సందర్భంగా వారు గతంలో కనెక్షన్‌లు ఉండి ఇప్పటి వరకు క్యాన్ నంబర్‌లు రాని వారు చాలా మంది ఉన్నారన్నారు. కొందరి వద్ద పంచాయతీకి చెల్లించిన రుసుముల పత్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పటి పంచాయతీ రికార్డులను చూసుకుని వారికి క్యాన్ నంబర్‌లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... త్వరలోనే నార్సింగి, అలకాపూర్ టౌన్‌షిప్‌లలో ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లను ప్రారంభిస్తున్నామన్నారు. ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటలలో సరఫరా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ట్యాంకర్ల సరఫరా సమయాన్ని ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు పెంచామన్నారు. త్వరలోనే అదనపు ట్యాంకర్లు, సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్‌రెడ్డి, టి.ప్రవీణ, ఎస్.బి.రాజశేఖర్, జి.గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి ఎన్.రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు ఆర్.బాబురావు, జె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లి, కొడుకు అదృశ్యం



సమ్రీన్‌బేగం, అబుబక్కార్

అత్తాపూర్: ఆస్పత్రికి వెళ్లి వస్తామని ఓ మహిళ తన కుమారుడిని తీసుకొని ఇంటి నుంచి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... సులేమాన్‌నగర్ డివిజన్‌కు చెందిన మహ్మద్ అసీమోహియుద్దీన్, సమ్రీన్‌బేగం(25) భార్యాభర్తలు. వీరికి ఏడాదిన్నర బాలుడు అబ్బుబకర్ సంతానం. ఈ నెల 22వ తేదీన ఇంట్లో ఆస్పత్రికి వెళ్లివస్తామని చెప్పి బాలుడిని తీసుకొని బయటకు వెళ్లింది. రాత్రైనా రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేశారు. ఆచూకీ లభించకపోవడంతో అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు అండగా మజ్లిస్



మహిళల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మహిళలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయం కార్వాన్, లంగర్ హౌస్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు మహిళలు ఆయనను కలిశారు. పొదుపు సంఘాల ఏర్పాటుకు తాము గ్రూపులుగా ఏర్పడ్డామని బల్దియా యూసీడీ విభాగం అధికారులతో మాట్లాడి తమకు సహాయం చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలో నేడు వందల సంఖ్యలో మహిళా పొదుపు సంఘాలు క్రియాశీలకంగా ఉన్నాయని, తన సలహాలు, సూచనల మేరకే ఈ సంఘాలు స్థాపించబడ్డాయన్నారు.

పార్టీ పటిష్టతకు సోషల్ మీడియా ప్రతినిధులు కృషి చేయాలి



రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఉమామహేంద్ర తదితరులు

చార్మినార్: పార్టీని మరింత పటిష్టం చేయడానికి సోషల్ మీడియా పాత్ర ఎంతో ఉంటుందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉమామహేంద్ర అన్నారు. ఇందు కోసం సోషల్ మీడియా ప్రతినిధులు నిరంతరం కృషి చేయాలన్నారు. బుధవారం రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కొమ్మరాజు సుమిరాన్, కో కన్వీనర్ అక్కలదేవి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం టి.ఉమామహేంద్రతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేంద్ర మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల వివరాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువయ్యేటట్లు ప్రచారం కల్పించాలన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు నాయకులు, కార్యకర్తలను ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేయాలన్నారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ పట్ల దుష్ప్రచారం చేస్తే వెంటనే తిప్పి కొట్టాలని ఆయన సోషల్ మీడియా ప్రతినిధులకు సూచించారు.